

4లో

ఏకపక్షంగా ఆస్తుల స్వాధీనం కుదరదు:సుప్రీం


RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 281 బుధవారం 6 నవంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన

- కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం
- నష్టపోతున్న కులాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది
- కులగణన అవసరాన్ని పార్లమెంట్‌లోనే ప్రస్తావించా
- కులగణనపేరు చెప్పగానే దేశ విభజనపేరుతో విమర్శలు
- కులగణన పేరు చెబితేనే ప్రధాని మోడీ విమర్శలు
- హైదరాబాద్ సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యలు






**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటులో విపక్షనేత రాహుల్ అన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన గురించి ప్రస్తావించగానే దేశాన్ని విభజించేస్తున్నామని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శంగా నిలవబోతున్నదని రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో కులగణనకు సంబంధించి పౌరహక్కులు, మేధావులతో నిర్వహించిన సభలో రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశసంపద సమానంగా పంచాలంటే..దేశం మొత్తం కులగణన సర్వే చాలా కీలకం అన్నారు. కులగణన సర్వే ఎందుకు కీలకమో వివరించారు. దేశంలో కుల వివక్ష కొనసాగుతుందని.. కులం విషయంలో ఓ విజన్ తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలపై మన విజన్ తో వెళ్లడం తప్పనిసరి అన్నారు. దేశాన్ని విభజించే కుట్ర చేస్తున్నానని ప్రధాని మోదీ అంటున్నారు.. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడం అవుతుందా అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల గణన సర్వే ద్వారా కులాల లెక్క తెల్చువచ్చు.. దేశవ్యాప్తంగా కులగణనపై పార్లమెంట్ చర్చపెట్టింది తానేనని రాహుల్ గాంధీ అన్నారు.

మిగతా 2లో.

## 25నుంచి పార్లమెంట్ సమావేశాలు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ సెషన్‌లో భాగంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సంవిధాన్ సదన్ (పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదికకానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. నవంబర్ 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తర్వాతే ఈ సెషన్ ప్రారంభంకానుంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనుందని తెలుస్తోంది. గత సెషన్‌లోనే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది. అయితే విపక్షాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో కేంద్రం ఒక్క అడుగు వెనక్కివేసి..దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.

## ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

### ప్రభుత్వంతో అన్ని వర్గాల్లోనూ ఆందోళన

### ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు పుచ్చుకున్నారు... ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలేదన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు.

మిగతాది 2లో...

## కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

### విద్యాహక్కుచట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయం

### సిఎం రేవంత్‌కు ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్యాహక్కు చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. 36,559 ఎస్జీటీలను, 3414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం చేస్తూ నవంబర్ 1వ తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం అన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మిగతాది 2లో...

## రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడమే మా కర్తవ్యం

: రేవంత్ రెడ్డి

### కులగణన సర్వేను తమ ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్న సీఎం

### కులగణనను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనేది రాహుల్ ఆలోచన అని వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
మనది రైజింగ్ తెలంగాణ... కాబట్టి దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బోయినపల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులగణన సర్వేను ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు.
కులగణనపై తమ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యమన్నారు. కులగణనను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనేది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. కులగణనను త్వరితగతిన పూర్తి చేసి బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లను అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కులగణనను 2025 జనగణనలో పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఈ వేదిక పైనే తీర్మానం చేస్తున్నామన్నారు. కులగణనపై పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ హైదరాబాద్ రావడం గొప్ప విషయమన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కులగణన సర్వే కీలకమన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు.

## వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### విజన్ 2025 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన మంత్రిపొంగులేటి కీలక ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):**
మౌలిక వసతుల అభివృద్ధితో పాటు, ఆధునిక టెక్నాలజీని కూడా జోడించి వరంగల్ నగరాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధి కోసం కీలక ప్రకటన చేశారు. విజన్-2025 పేరుతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా, వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మిగతా 2లో.



# కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

(మొదటి పేజి తరువాయి)

మీ పాలన పుణ్యమా అని ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలపై ఉన్న నమ్మకం రోజురోజుకీ దిగజారుతున్నది. మీ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తోడు ఉపాధ్యాయులకు శాపాలుగా మారుతున్నాయి. ఇప్పుడు కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుంది. ఇవి కాకుండా మరేఇతర పనులకు వినియోగించకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తురది. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలినాలి చేసుకునే వారే. అకస్మాత్తుగా ఒంటి పూట బడులు నడపడం వలన పిల్లలకే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయి. పిల్లల చదువులు కుంటుపడటంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. కాబట్టి, విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# ఆహారకల్తీని ఉపేక్షించబోం

### ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

### ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజర్సింహ



**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** ఆహారాన్ని కల్తీ చేసేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని.. కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హెచ్చరించారు. ఇటీవల ఆహారకల్తీపై వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు. నగరంలోని వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వసతి గృహాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టకుండా ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచనున్నట్టు మంత్రి ప్రకటించారు. ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్‌ఎంసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు.

# వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### విజన్ 2025 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన

### మంత్రిపొంగులేటి కీలక ప్రకటన

(మొదటి పేజి తరువాయి)



. ఇటీవల వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి, నగర అభివృద్ధిపై చాలా కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. వరంగల్‌ను తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని మా లక్ష్యం. మన నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం, అని మంత్రి చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం, నగర అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని, మొదటి ప్రాధాన్యతగా విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఈ ప్రకటనతో వరంగల్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. వరంగల్ ప్రజలకు మంత్రి కొండా సురేఖ తీపి కబురు అందించారు. వరంగల్ ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తానన్నారు మంత్రి సురేఖ. అత్యుత్తమ నగరంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ఎ÷-లాన్ అమలుకు ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

# రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### సన్నధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని వ్యాఖ్య

### ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని పిలుపు



**హైదరాబాద్,నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** :రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వచ్చే ఏడాది జనవరి నుంచి తెలంగాణవ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇది దేశ చరిత్రలో ఓ మైలురాయి అన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దాన్యం సేకరణ కేంద్రాల్లో ఎలాంటి గందరగోళం ఉత్పన్నం కాకుండా... రైతులకు మద్దతివ్వడానికి ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలన్నారు. సన్న ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఈరోజు సాయంత్రం ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

(మొదటి పేజి తరువాయి)

మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో?ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభ మయ్యాయి.ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకొలేదన్నారు. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నేరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను



తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి?మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నానని కేటీఆర్ తెలిపారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ కులగణన

(మొదటి పేజి తరువాయి)

భారతదేశంలో కులవ్యవస్థ చాల బలంగా ఉందని అన్నారు. ఇది కాదనలేని వాస్తవమని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు. కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని.. రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని చెప్పుకొచ్చారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికారులు నిర్ణయించకూడదని, సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా? కులగణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంది. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందాం. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పాను. రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం అని రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు సర్కార్ ఒంటిపూట బడులను ప్రకటించింది. దేశవ్యాప్తగా ఇప్పటికీ అన్ని రంగాల్లో కుల వివక్ష ఉందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి కులగణన అవసరం అన్నారు. ఏ వ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు ఉన్నారో తెలియాల్సిఉందన్నారు. కులగణనతో అభివృద్ధి , రాజకీయ స్థితిగతులు మారుతాయని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. తాను దేశవ్యాప్తంగా పర్యటించినప్పుడు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో కుల వివక్ష ఉందని తాను గుర్తించానని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ కనిపించదన్నారు. కుల వివక్ష కారణంగా ఇతర కులాల వారు అవకాశాలు కోల్పోతున్నారని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే యాభై శాతం రిజర్వేషన్లను ఎత్తి వేస్తామని కులగణన ద్వారా సమానంగా అందరికీ అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో తాను అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థల్లో కుల వివక్ష ఉందన్నారు. రాజకీయ న్యాయవ్యవస్థల్లో ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారని...దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా అని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని రాహుల్ సూచించారు. కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి. అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామన్నారు. కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్సంగా ఉంటుందని ఈ విషయంలో తాను తెలంగాణ నాయకత్వాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాంధీ కార్యక్రమానికి ప్రముఖులైన ఆహ్వానితుల్ని మాత్రం సమావేశంలోకి ఆహ్వానించారు. ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేయనున్నారు.

## ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ప్రకటించిన తెలంగాణ ఇంటర్ బోర్డు

**నవంబర్ 6 నుంచి 26 వరకు ఫీజులు చెల్లించేందుకు అవకాశం**

**27 నుంచి డిసెంబర్ 4 వరకు ఫైన్‌తో చెల్లించే వెసులుబాటు**

**రూ.1000 ఫైన్ ఉంటుందని తెలిపిన ఇంటర్ బోర్డు**

ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను తెలంగాణ ఇంటర్ బోర్డు ఈరోజు ప్రకటించింది. నవంబర్ 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఫీజులు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత రూ.1,000 ఫైన్‌తో నవంబర్ 27వ తేదీ నుంచి డిసెంబర్ 4 వరకు చెల్లించవచ్చు. ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు రూ.520, ఒకేషనల్ విద్యార్థులు రూ.750 చెల్లించాలని బోర్డు తెలిపింది. సెకండ్ ఇయర్ జనరల్ ఆర్ట్స్ విద్యార్థులు రూ.520, సెకండ్ ఇయర్ జనరల్ సైన్స్ విద్యార్థులు రూ.750 చెల్లించాలని ఇంటర్ బోర్డు తెలిపింది.

# శంషాబాద్ ఎయిర్పోర్ట్ కాలనీలో నవగ్రహాల విగ్రహాలు ధ్వంసం..

**మరోసారి హిందూ దేవుళ్ళ విగ్రహాల పై దాడులు...**

**హిందూ దేవతలపై వరుస దాడులు ఎందుకు జరుగుతున్నాయి..?**

**దాడులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బిజెపి బజరంగ్దళ్ కార్యకర్తలు..**

**నవగ్రహాల విగ్రహాలను ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు..**





**(శంషాబాద్) నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల కేంద్రం ఎయిర్పోర్ట్ కాలనీలో మరోసారి హిందూ దేవతల పైన గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు.హిందూ దేవాలయాలపై దాడుల నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బిజెపి,బజరంగ్దళ్ కార్యకర్తలు సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం ఘటన మరవక ముందే శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మరో దేవాలయం లోని విగ్రహాల ధ్వంసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎయిర్ పోర్ట్ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న నవగ్రహాల విగ్రహాలను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు ఉదయం పూజ చేసేందుకు వచ్చిన పూజారికి విగ్రహాలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో కాలనీ వాసులకు సమాచారం ఇచ్చాడు హుటాహుటిన హనుమాన్ దేవాలయానికి చేరుకున్న కాలనీవాసులు విగ్రహాల ధ్వంసం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విగ్రహాల ధ్వంసం పై ఆధారాలను సేకరిస్తున్నారు. సంఘటన స్థలంలో ఓ అనుమానితుని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నవగ్రహాల ధ్వంసం పై నిందితులను వెంటనే పట్టుకుని శిక్షించాలని కాలనీ వాసులు ఆందోళన చేశారు.ఏదో ఒకచోట హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని బిజెపి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాలపై దాడులకు తెగబడ్డ నిందుతులను కఠినంగా శిక్షిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని అన్నారు.దేవాలయం ఆధ్వర్యంలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసి కమిటీ నిర్ణయాల మేరకు ఉద్యమాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు మరొకసారి హిందూ దేవతలపై ఇలా జరగకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# మృతురాలి కుటుంబానికి చేయూత




చెన్నారావుపేట, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): మండల పరిధిలోని పాత మగ్దుంపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మాదాసి కొమురమ్మ మృతి చెందారు. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందించి, చేయూతనిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు వీరస్వామి, మాజీ ఉప సర్పంచ్ కర్ణాకర్, మండల నాయకులు పోలేపల్లి బిక్షపతి, బండారి సత్యం, రంజిత్, మాదాసి రమేష్, మైదం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించిన సిఐ చంద్రమోహన్




చెన్నారావుపేట, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం నెక్కొండ సిఐ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు జరగకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకొండ ఎదురవకుండా జాగ్రత్త వహించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అనంతరం కోనాపురం, ఉప్పరపల్లి, చెన్నారావుపేట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



చెన్నారావుపేట, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి సందర్భంగా నాగదేవతకు పాలు పోసి, పూలు, నైవేద్యం సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివాలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ పెరిగిపోయింది.

# బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ




రాయపర్తి, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలంలోని జగన్నాథపల్లి గ్రామానికి చెందిన కందుకూరి లచమ్మ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు మంగళవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నంగునూరి అశోక్ 50 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడెల్లి శ్రీలత శ్రీనివాస్, కందుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.


# విద్యుత్ ఘాతంతో ఎద్దు మృతి

రాయపర్తి, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): విద్యుత్ ఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన రాయపర్తి మండలం మైలారం గ్రామ చక్ర తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని మైలారం చక్ర తండాకు చెందిన రైతు గుగులోత్ రాజు ఎప్పటిలాగే ఎద్దును మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో మేత మేస్తున్న ఎద్దుకు ప్రమాదవశాత్తు ట్రాన్స్ఫార్మర్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని చెబుతున్నారు. దీంతో రాజు కుటుంబ సభ్యులు ఎద్దు మృతి పట్ల కన్నీరు మున్నీరుగా రోదించారు. ఎద్దు విలువ సుమారు 50 వేల రూపాయలు ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రాజుకు నష్టపరిహారం చెల్లించి తనను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ం



# ఉద్యమకారులను సన్మానించిన

## బహుజన సేవా సమితి అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ




తల్లాడ, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ఉద్యమకారులను బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ సన్మానించారు. మంగళవారం ఉద్యమకారులు మోదుగు ఆశీర్వాదం, రావుల గోపి గౌడ్ లను సన్మానించి వారికి నూతన వస్త్రాలు, ఆర్థిక సాయం అందించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ప్రారంభ దశలో ఆశీర్వాదం ఒక్కడే జెండాలు పట్టుకొని తిరిగి, అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే అనేక మంది సకలజనుల సమ్మెలాంటి నిరసనలు చేపట్టారని తెలిపారు. ఇటువంటి వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారికి ప్రతినెల తమ వంతు సహకారంగా ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు (జివిఆర్) మాట్లాడుతూ నిరుపేదలను, పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు ఉద్యమకారులను సైతం గుర్తించడం, అభినందిస్తూ సన్మానించడం, ఆర్థిక సహాయ సహకారాలు అందించడం అభినందనీయం అన్నారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు బాలకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన విజయం కమిటీ సభ్యులు నారపోగు ప్రసాద్, సేవాసమితి సభ్యులు బోనాసి శ్రీనివాసరావు, కాటయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ సమీక్ష

**- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**- దొడ్డు, సన్న రకం ధాన్యం గుర్తింపుపై అధికారులకు శిక్షణ**




ఖమ్మం, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):
జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సన్న రకం ధాన్యం క్రింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లకు తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణ అందించాలని అన్నారు. జిల్లాలో ఉన్న మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామని, అండర్ టేకింగ్ ఆఫిడవిట్ తీసుకొని ధాన్యం అలాట్మెంట్ చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద ఎక్కడ తాలు పేరుతో కోతలు పెట్టవద్దని అన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలని అన్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ధాన్యం మన జిల్లాకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం పట్ల సానుకూలత వచ్చే విధంగా అధికారులు పని చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, సన్న రకం ధాన్యానికి బోనస్ వెంట వెంటనే అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల పరిధిలో వీలైనంతవరకు రైతుకు అనుకూలంగా ఉంటూ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యత ప్రమాణాలను రైతులకు వివరించాలని, రైతుల కోసమే మనం ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దని అధికారులకు సూచించారు.

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల (1.3 లక్షల సన్న రకం, 70 వేల దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఇందులో డీసీఎంఎస్ ద్వారా 27, డిఆర్డీఏ ద్వారా 138, పిఏసీఎస్ ద్వారా 158 కేంద్రాల ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు మొదలగు మౌళిక వసతులు కల్పించామని అన్నారు.

మన జిల్లా సరిహద్దు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నందున 14 చెక్ పోస్ట్ లను అప్రమత్తం చేశామని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు 24 గంటలపాటు షిఫ్టులలో చెక్ పోస్ట్ వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని చెక్ పోస్ట్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత, లోకల్ రైతు, ధాన్యం దిగుబడి వివరాలను సర్టిఫై చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్ తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో ప్రైవేటు గోదాములలో అందుబాటులో ఉన్న స్థలం గుర్తించామని అన్నారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అప్పగించిన వెంటనే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేస్తామని సమాచారం అందించామని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు జిల్లాలో మిల్లర్లు అంగీకరించారని తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**- మాదిగ, మాదిగ ఉప కులాల జేఏసీ**



**వర్ధన్నపేట, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):** మాదిగ, మాదిగ ఉపకులాల జేఏసీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా, ప్రజా సంఘాలకు అతీతంగా, ఉద్యోగులు, మేధావుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ మాదిగ జేఏసీ నాయకులు మిద్దెపాక రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసీ ముఖ్య నాయకులు తూళ్ల కుమారస్వామి, జన్ను రాములు ,జన్ను నర్సయ్య, వళ్ళందాస్ కుమార్, మారపెల్లి ఎల్లయ్య, డాక్టర్ కొండేటి శ్రీనివాస్, కంజర్ల మహేష్, జక్కి శ్రీకాంత్, తాటికాయల వివేకానంద, దమ్మన్నపేట యకన్న, జన్ను రాజు, జోగుల సంపత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎబిసిడి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని, అది అమలయ్యే వరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వద్దని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, హసన్ పర్తి, కాజీపేట, హన్మకొండ, వరంగల్ మండలాల నుండి వందలాదిగా మాదిగ, ఉప కులాల జాతి బిడ్డలను తరలించిన నాయకులకు, కార్యకర్తలకు, తరలి వచ్చిన జాతి బిడ్డలకు అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐక్యతను కొనసాగించేలా అందులో అందరూ కంకనబద్దులై కలిసి ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కట్రాల విద్యార్థిని ఎస్ శృతి ఎంపిక



**వర్ధన్నపేట, నవంబర్ 5,(జర్నలిస్ట్ వార్త):** ఈనెల 4వ, తేదీన జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్ 17 యోగ బాలికల విభాగంలో కట్రాల పాఠశాలలో చదువుతున్న ఎస్ శృతి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సెలెక్ట్ అయినట్లు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్జిఎఫ్ఐ వర్ధన్నపేట జోన్ సెక్రటరీ గుగులోతు సోమన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ, తేదీన జరిగే రాష్ట్రస్థాయి వరంగల్ జిల్లా కెమిస్ట్రీ భవన్ పోచం మైదాన్ లో జరిగే పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. తెలియజేయడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఎం వీరికి పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గ్రామ ప్రజలు అభినందించారు.

# హైదరాబాద్ నగరంలో మరో దారుణం

## మహిళపై దారుణంగా సామూహిక అత్యాచారం -మహిళ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** హైదరాబాద్ నగరంలో మరో దారుణం జరిగిం. మరో మహిళ సామూహిక అత్యాచారానికి గుయ్యింది.పనికోసం వచ్చిన ఆ మహిళ మృగాళ్ళను నమ్మి వెళ్లి అత్యాచారానికి గురయ్యింది. పొట్ట కూటి కోసం భవన పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎప్పటిలాగే సోమవారం కూడా ఆ మహిళ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో అనుకోని ఆపద ఆమెను చుట్టుముట్టింది. ముగ్గురు వ్యక్తుల మాయ మాటలు చెప్పి పని ఉందని తమవెంట తీసుకుని వెళ్లారు. తీరా అక్కడికి తీసుకుని వెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఓ కార్మికురాలిపై ముగ్గురు కామాంధులు దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఓ భవనంలో పని చేస్తోంది. ఉదయం పనికి వెళ్లిన మహిళ




సాయంత్రం భవనంలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. హైటెక్ సిటీ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం మహిళ ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో ఎప్పటి నుంచో ఆమెపై కన్నేసిన ముగ్గురు కామాంధులు ఆటోలో ఆమె వద్దకు వచ్చారు. ఆమెకు మాయ మాటలు చెప్పి వాళ్లతో తీసుకెళ్లారు. ఆపై దారుణానికి పాల్పడ్డారు. తమ ఇంట్లో బట్టలు ఉతికే పని ఉందని మహిళకు చెప్పారు. దీంతో బట్టలు ఉతికితే డబ్బులు వస్తాయని ఆశ పడి వారిని నమ్మి వెళ్లింది. ముగ్గురు వ్యక్తులు ఆటోలో మహిళను మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాము ఉంటున్న రూంకు తీసుకువచ్చారు. ఆపై మహిళపై అతి దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. కామాంధుల అఘాయిత్యంతో మహిళ గట్టిగా కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న ఓ మహిళ అక్కడకు వచ్చి జరుగుతున్న దారుణాన్ని చూసి అవాక్కయ్యింది. అయితే మహిళ రావడాన్ని చూసిన ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై బాధితురాలు తనకు జరిగిన అన్యాయం గురించి సదరు మహిళకు చెప్పి భోరున విలపించింది. దారుణాన్ని చూసిన సదరు మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఏకపక్షంగా ఆస్తుల స్వాధీనం కుదరదు

## అన్ని ఆస్తులను సమాజ ఆస్తులుగా గుర్తించలేం - సుప్రీం కోర్టు ధర్మాసనం చారిత్రక తీర్పు

**న్యూఢిల్లీ, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** ఏకపక్షంగా వ్యక్తుల ఆస్తులను స్వాధీనంచేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని, ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. అయితే కొన్ని కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరుగా పరిగణించొచ్చా అన్న కీలక కేసుపై కొద్దినెలల క్రితం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ ప్రైవేటు ఆస్తి సమాజ వనరు కాదు.. అన్ని ప్రైవేటు ఆస్తులూ సమాజ వనరులే.. ఈ రెండు పరస్పర భిన్నమైన విధానాలు. వీటిపై ప్రస్తుత ప్రైవేటీకరణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో



ఉంచుకొని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. 1950లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు జాతీయాకరణ జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతోంది. ప్రైవేటు పెట్టుబడులు ఉన్నాయి. ఇది పరివర్తన. కాబట్టి న్యాయస్థానం వ్యాఖ్యానం కొత్తగా ఉండాలి. ప్రస్తుత భారత్‌కు అనుగుణంగా ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ దీనిపై తీర్పు వెలువరించింది. అలాగే కోల్‌కతాలో పార్కు నిర్మాణం కోసమంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసులోనూ సుప్రీం తీర్పునిస్తూ.. చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించినా సరైన పద్ధతులు మాత్రం పాటించలేదు. వ్యక్తుల ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించినప్పటికీ రాజ్యాంగం తగిన రక్షణ కల్పించింది. నిర్బంధ స్వాధీనాలు, హడావుడి నిర్ణయాలు, న్యాయబద్ధంగాలేని పరిహారాల కారణంగా పౌరులు నష్టపోవడానికి చట్టం అనుమతించబోదని ధర్మాసనం తెలిపింది. ఆస్తి స్వాధీనం విషయాన్ని ముందుగా తెలియజేయడం, తగినంత సమయం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, పునరావాసం కల్పించడం, ప్రజాప్రయోజనం కోసమేనని వివరించడం వంటివన్నీ ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

# నిమ్స్‌లో విద్యార్థినులను పరామర్శించిన మంత్రి సురేఖ

**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** నగరంలోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు మహాలక్ష్మి, జ్యోతి, శైలజలను మంత్రి కొండా సురేఖ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధవహిస్తుందని భరోసానిచ్చారు. వారిని ఓదార్చారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని నిమ్స్ డైరక్టర్ బీరప్ప, హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్, నెఫ్రాలజీ గంగాధర్ లు మంత్రికి సునిశితంగా వివరించారు.

వారికి అందిస్తున్న చికిత్స వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా వసతి, భోజన సదుపాయాలను కల్పించాలని నిమ్స్ డైరక్టర్‌కు మంత్రి సురేఖ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం స్థిమితపడుతండగా, మరొక విద్యార్థికి ఇంటెన్సివ్ చికిత్సను అందిస్తున్నారని మంత్రి తెలిపారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు హాస్టల్‌లో పెట్టిన ఆహారంతో అస్వస్థతకు గురి కాలేదని, ఇంటి నుంచి తెచ్చుకున్న తినుబండారాలు తినడం వలనే అస్వస్థతకు గురయ్యారని, అదే ఆహారాన్ని తిన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితి బాగానే వున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి సురేఖ వివరించారు. ఏదేమైనప్పటికీ పరీక్షకు పంపిన ఆహారపదార్థాల రిపోర్టులు వచ్చాక ఈ సంఘటనకు బాధ్యులు అధికారులని తేలితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని మంత్రి సురేఖ తేల్చి చెప్పారు.

### హరీశ్‌రావు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు ఏదో సాకు దొరికింది కదా అని ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడారని మంత్రి సురేఖ ఆరోపించారు. వాస్తవావస్తవాలు తెలుసుకోకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హాస్టళ్ళ నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. విద్యారంగ




బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలతో కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళ ఏర్పాటులో ఎంతో నిబద్ధతతో ముందుకు వెళుతున్నారని మంత్రి అన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమ రంగాలపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎంతో కచ్చితమైన ప్రణాళికతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, అర్థరహితంగా ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకోవద్దని సూచించారు.

# కుర్చీని కాపాడుకోవడం కోసం హైడ్రా పేరుతో బెదిరింపులకు దిగుతున్నారు: కేటీఆర్

**హైదరాబాద్, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి డబ్బులు పంపించాలని... పంపకుంటే ఢిల్లీ పెద్దలు ఊరుకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అందుకే హైడ్రా పేరుతో అందరినీ బెదిరిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాను మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసి ఉండే బాగుండేదని... కానీ అదో బ్లాక్‌మెయిల్ దుకాణం అన్నారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రాపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

తెలంగాణ గురించి అవగాహన లేనివారు... పరిశ్రమల గురించి అవగాహన లేనివారు



నడుపుతున్నట్లుగా హైడ్రా ఉందని మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ వింగ్ అని పెట్టామని... దానినే ఈ ప్రభుత్వం హైడ్రా అని మార్చిందన్నారు. హైడ్రా కారణంగా ఈ రోజు ఎవరైనా లేక్ వ్యూ అని పేరు పెట్టాలనుకున్నా భయపడుతున్నారన్నారు. బెదిరింపుల కారణంగా మార్కెట్ మొత్తం ఆగం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పిచ్చి నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ పడిపోతోందని.. మార్కెట్‌ను నాశనం చేశారని విమర్శించారు.

ప్రాజెక్టులకు హైడ్రా క్లియరెన్స్ అని చెబుతున్నారని... కానీ అనుమతులు గాలిలో దీపం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్-బీపాస్ ప్రకారం 21 రోజుల్లో క్లియరెన్స్ వస్తోందా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ ధమాల్ అని పేపర్లలో వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తోన్న పనికి ఆదాయం పడిపోయిందని... ప్రాజెక్టులు రద్దయ్యాయని... కొత్త ప్రాజెక్టులూ లేవన్నారు.

# చెట్టును ఢీకొన్న విద్యార్థులతో వెళుతున్న ఆటో

## 13మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు

**సిద్దిపేట నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** విద్యార్థులను పాఠశాలలకు తరలించే ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో 13 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులో చోటు చేసుకుంది. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్ పల్లి గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు దుబ్బాక పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో కమ్మర్ పల్లి నుంచి 13 మంది విద్యార్థులతో బయలుదేరిన ఆటో పట్టణ శివారు చికోడు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాబు, సుదర్శన్, రోహిత్, యశ్వంత్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలైనాయి. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఏడుగురిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాధపడుతున్న 6 మంది విద్యార్థులను దుబ్బాకలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి శాంతింప చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

# కారు బీభత్సం: మహిళ మృతి

**సూర్యాపేట నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ విషాద సంఘటన సూర్యాపేటలో చోటుచేసుకుంది. మంగళవారం మునగాల మండలం మాధవరం వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి.. పాదచారులు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుల తరలించారు. సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించిన పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

# కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ ఈవో

**తిరుపతి, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 6వ తేదీ జరుగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28వ తేదీ ధ్వజారోహణంతో



ప్రారంభమవుతాయన్నారు. డిసెంబరు 2వ తేదీ గజవాహనం, 3న బంగారు రథం, 5న రథోత్సవం, 6వ పంచమితీర్థాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ రాత్రి ఆయా వాహనాలపై స్వామివారు మాడ వీధుల్లో ఊరేగుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవోలు గోవింద రాజన్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ

**న్యూఢిల్లీ, నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** ప్రముఖ వ్యక్తులు.. చారిత్రక కట్టడాలు.. ప్రముఖ ప్రదేశాలు.. ఇలా ఏ సమాచారం కావాలన్నా ముందుగా గుర్తొచ్చేది వికీపీడియా. ఈ ఎన్‌సైక్లోపీడియా మనకు చితంగా సమాచారన్ని అందిస్తోన్న విషయం తెలిసిందే. అయితే, ఈ వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఇందులో కచ్చితత్వం లేని సమాచారం ఉంటోందన్న




ఫిర్యాదుల మేరకు నోటీసులు పంపింది. వికీపీడియాలో పక్షపాతంగా సమాచారం ఉంటోందని పలువురు నుంచి ఫిర్యాదులు అందినట్లు కేంద్రం నోటీసుల్లో తెలిపింది. చిన్న సంపాదకులకు, సంస్థలకు కూడా కంటెంట్‌పై ఎడిటోరియల్ నియంత్రణ ఉంటుందని.. వికీపీడియాకు ఆ వ్యవస్థ ఎందుకు లేదని ప్రశ్నించింది. వికీపీడియాను మధ్యవర్తిగా కాకుండా.. పబ్లిషనర్‌గా ఎందుకు పరిగణించకూడదని ప్రశ్నించింది. కొంతమంది వ్యక్తులతో కూడిన బృందానికి మాత్రమే ఈ పేజీల్లోని సమాచారంపై నియంత్రణ ఉందనే అభిప్రాయం ప్రజల్లో ఉందని పేర్కొంది. కాగా, ఇటీవలే వికీపీడియా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. ప్రముఖ న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ కూడా వికీపీడియాపై కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు దావా వేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు వికీపీడియాపై ఆగ్రహం కూడా వ్యక్తం చేసింది.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

## పుట్టలో పాలుపోసి భక్తి చాటుకున్న మహిళలు

**వేములవాడ నవంబర్ 5 (జర్నలిస్ట్ వార్త ):** కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగగా జరుపుకుంటారు. నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలు పోసి పూజలను చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది. కనుక చెట్టును, పుట్టను, రాయిని, నదులను, పశు



పక్ష్యాదుల సహా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా భావించి పూజిస్తారు. అందులో భాగంగానే నాగుపామును నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తారు. నాగుల చవితికి పుట్టకు నూలు చుట్టి పూజలు చేస్తారు. పట్టణం, పల్లెలు అనే తేడా లేకుండా నాగు పాము పుట్టల వద్ద స్థానిక దేవాలయాల వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణెశ్వర స్వామి దేవస్థానం వద్ద నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలో పాలు పోయటానికి ఉదయం నుండి బారులు తీరారు. పుట్టకు పూజలు చేసి పాలు పోసి తమని చల్లా చూడమంటూ నాగదేవతను వేసుకుంటున్నారు. వేములవాడ,ధర్మపురిలో నాగుల చవితి వేడుకలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి తెల్లవారుజాము నుండే పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తరలివచ్చారు. నాగదేవత విగ్రహంపై పాలు పోసి, మొక్కలు చెల్లించుకుంటున్నారు. పుట్టపై దీపం వెలిగించి, పూలు, పండ్లు పెట్టి నాగేంద్రుడి కృపాకటాక్షాలు తమపై ఉండాలని పుట్ట మట్టి బొట్టు పెట్టుకొని పూజలు నిర్వహించారు. పలు జిల్లాలోని ప్రజలు తెల్లవారు జామునుండే ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సిద్దేశ్వరాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప, కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు నాగేంద్ర స్వామిని దర్శించుకుని పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

# ఎనిమిదేళ్ల బాలుడి చేతిలో మోసపోయా

## కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్



తాను ఎనిమిదేళ్ళ బాలుడి చేతిలో మోసపోయానని హీరోయిన్ నివేదా పేతురాజ్ వాపోయారు. తన చేతిలో ఉన్న కరెన్సీని బలవంతంగా లాక్కొని పారిపోయాడన్నారు. కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్ 'ఒరునాల్ కూత్తు', 'పొదువాగ ఎన్‌మనసు', 'టిక్ టిక్ టిక్' వంటి అనేక చిత్రాల్లో నటించిన ఆమె... ఇపుడు చెన్నై నగరంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అడయార్ ప్రాంతంలో ఒక బాలుడు చేతిలో మోసపోయినట్టు ఆమె వెల్లడించారు. విషయంలోకి వస్తే.. 'అడయార్ సిగ్నెల్ వద్ద ఎనిమిదేళ్ళ బాలుడు డబ్బులు అడిగాడు. ఉచితంగా డబ్బులు ఇచ్చేందుకు నా మనసు అంగీకరించలేదు. దీంతో రూ. 50 విలువైన పుస్తకాన్ని కొనాలని చెప్పడంతో రూ. 100 నోటు తీయగా, ఆ బాలుడు రూ. 500 అడిగాడు. దీంతో పుస్తకాన్ని బాలుడికి తిరిగి ఇచ్చి, నేను ఇచ్చిన రూ.100 నోటు వెనక్కి తీసుకున్నాను. అయితే, ఆ పిల్లవాడు పుస్తకాన్ని కారులో పడేసి... చేతిలోని రూ.వంద నోటు లాక్కొని పారిపోయాడు' అని పేర్కొంది. ఇది చాలా సిగ్నల్స్ వద్ద జరుగుతున్న విషయమే. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి ఘటనకు సంబంధించిన వీడియోనే ఒకటి వైరల్ అవుతుంటుంది. వాటర్ బాటిల్స్ అమ్మే అతను.. ఒక కారు దగ్గర నిలబడి మూత తీయడానికి ప్రయత్నించగా.. ఆ మూత రాకపోవడంతో, కారులోని యువతి ఆ బాటిల్ తీసుకుని మూత తీసి సదరు వ్యక్తికి ఇవ్వబోగా.. రూ. 20 ఇవ్వాలని అతను చెప్పడంతో చేసేది లేక ఆమె రూ. 20 చెల్లించుకుంటుంది. ఇలాంటి మోసాలు ప్రతి రోజూ చాలా అంటే చాలానే జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు నివేదా పేతురాజ్ కూడా అలాంటి మోసానికే గురయింది. నివేదా పేతురాజ్ విషయానికి వస్తే.. తెలుగు ప్రేక్షకులకూ ఆమె సుపరిచితమే. 'అల వైకుంఠపురములో' చిత్రంలో సుశాంత్‌కి లవర్‌గా ఆమె నటించింది. 'మెంటల్ మదిలో, చిత్రలహరి, పాగల్, దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె వెబ్ సిరీస్‌లతో బిజీ నటిగా గడుపుతోంది.

# 'గేమ్ ఛేంజర్' టీజర్ విడుదలకు తేదీ ఫిక్స్...

### రామ్ చరణ్, శంకర్ కాంబోలో 'గేమ్ ఛేంజర్'
### ఈ నెల 9న టీజర్ లాంచ్
### లక్నో వేదికగా టీజర్ లాంచ్ వేడుక
### సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానున్న సినిమా

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే మూవీలోని రెండు పాటలు విడుదలై శ్రోతలను బాగా ఆకట్టుకున్నాయి. దీంతో అభిమానులు గేమ్ ఛేంజర్ టీజర్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీజర్ అప్‌డేట్ రానే వచ్చింది.నవంబర్ 9న 'గేమ్ ఛేంజర్' టీజర్ రానుంది. కాగా, మేకర్స్ ఈ టీజర్ లాంచ్ వేడుక కోసం ఎవరూ ఊహించని వేదికను ఎంపిక చేసుకున్నారు. లక్నో వేదికగా టీజర్ లాంచ్ చేయబోతున్నారు. మొత్తానికి శంకర్ ఈసారి రూటు మార్చి ఏకంగా నార్త్ ఇండియాలో ప్లాన్ చేసి భారీ స్కెచ్ వేశాడనే చెప్పాలి.

యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చెర్రీ సరసన బాలీవుడ్ భామ కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇతర కీలక పాత్రల్లో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కన్నడ నటుడు జయరామ్ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తుండగా... ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు.




# రకుల్ ప్రీత్ పై దారుణమైన ట్రోలింగ్



రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ 'గిల్లి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా 'కెరటం'లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మెగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. 'దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను. అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు' అంటూ రకుల్ వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పలువురు ఆమెపై ట్రోల్ చేస్తున్నారు. ఓ యూజర్ ఖరీదైన బట్టలు ఎందుకు ధరిస్తున్నారు ? అదే డబ్బును పేదలకు దానం చేస్తారా? అని ఒకరు ప్రశ్నించారు. మరొకరు చికెన్ తినే సమయంలో నోట్లు కూడా తింటారా? మరో యూజర్ కామెంట్ చేశాడు. 'దేవుడికి ధన్యవాదాలు. నా తల్లిదండ్రులు ఇలా కాదు. నా బాల్యాన్ని ఎంజాయ్ చేసేందుకు అనుమతించారు. మంచి చెడులకు మధ్య తేడాను కూడా నేర్పించారు' మరో నెటిజన్ అంటూ స్పందించాడు. ఇదిలా ఉండగా.. రకుల్ ప్రీత్ సింగ్ చివరగా ఇండియన్-2 మూవీలో నటించింది. ప్రస్తుతం, హిందీలో అజయ్ దేవగన్‌తో 'దే దే ప్యార్ దే 2' మూవీలో నటించనున్నది. ఈ మూవీ వచ్చే ఏడాది విడుదల కానున్నది.

# విడుదల తేదీని లాక్ చేసిన 'తండేల్ '




చందూ మొండేటి దర్శకత్వంలో టాలీవుడ్ యువ సామ్రాట్ నాగ చైతన్య తన తదుపరి ప్రాజెక్ట్ ని ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ సినిమాకి మూవీ మేకర్స్తండేల్ అనే టైటిల్ ని లాక్ చేసారు. ఈ పాన్ ఇండియన్ యాక్షన్ డ్రామా చైతన్య కెరీర్లోనే అత్యంత భారీ వ్యయంతో కూడుకున్న ప్రాజెక్ట్. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం తాండల్ ఫిబ్రవరి 7, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా ప్రకటించబడింది. చిత్ర నిర్మాతలు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విడుదల తేదీని వెల్లడించారు. చివరి 10 రోజుల షూటింగ్ త్వరలో పూర్తవుతుందని, ఆ తర్వాత టీమ్ పూర్తి స్థాయి ప్రమోషన్లను ప్రారంభించి పోస్ట్ ప్రొడక్షన్ను పూర్తి చేస్తుందని దర్శకుడు చందూ మొండేటి పంచుకున్నారు. ఈ చిత్రంలో సాయి పల్లవి కథనాయికగా నటిస్తుంది. ఈ సినిమాలో ప్రియదర్శి, దివ్య పిళ్లై కీలక పాత్రలలో నటిస్తున్నారు. తండేల్ దాని ఆకట్టుకునే కథాంశంతో మరియు దేవిశ్రీ ప్రసాద్ సంగీతంతో భారీ అంచనాలని కలిగి ఉంది. GA2 పిక్చర్స్ క్రింద బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ సినిమాని సమర్పిస్తున్నారు.

# ఆస్కార్‌కు అర్హత సాధించిన ఇండియన్ షార్ట్ ఫిల్మ్




2025 ఆస్కార్‌కు ఇండియన్ షార్ట్ ఫిల్మ్ అర్హత సాధించింది. చిదానంద తెరకెక్కించిన 'సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్ టు నో' ఆస్కార్ బరిలో నిలిచింది.ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాత పోస్ట్ పెట్టారు. లైవ్ యాక్షన్ కేటగిరిలో ఇది అర్హత సాధించిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా టీమ్‌కు అభినందనలు తెలిపారు.16 నిమిషాల నిడివి ఉన్న ఈ షార్ట్ ఫిల్మ్‌ను ఓ కన్నడ జానపద కథ ఆధారంగా రూపొందించారు. ఓ వృద్ధురాలి కోడిని ఎవరో దొంగలించడం.. దానిని కనుగొనడం కోసం ఆమెపడే తపనను ఇందులో చూపారు. ఇటీవల జరిగిన కేన్స్-2024లోనూ ఇది ఉత్తమ లఘుచిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది. హాలీవుడ్ షార్ట్ ఫిల్మ్‌లతో పోటీపడి మొదటి బహుమతి గెలుచుకుంది. మొత్తం వివిధ భాషలకు చెందిన 17 లఘు చిత్రాలతో పోటీపడి తొలి స్థానంలో నిలిచింది. అలాగే బెంగళూరు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ 'సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్ టు నో' మొదటి బహుమతి గెలుచుకుంది. దీంతో ఆస్కార్‌ను కూడా తీసుకువస్తుందని పలువురు సినీప్రియులు అభిప్రాయపడుతున్నారు.బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్ మాజీ సతీమణి కిరణ్‌రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' 2025 ఆస్కార్‌కు మన దేశం నుంచి ఎంపికైన విషయం తెలిసిందే. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ చిత్రాన్ని ఆస్కార్‌కు పంపింది. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది.

# తీవ్రంగా గాయపడ్డ హీరోయిన్.. కీలక నిర్ణయం తీసుకున్న చాందిని చౌదరి..



నటనపై ఆసక్తితో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన తెలుగమ్మాయి చాందిని చౌదరి. కుందనపు బొమ్మ ద్వారా తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన చాందిని..ఆ తర్వాత వరుసగా లు, వెబ్ సిరీస్ చేస్తూ ఇండస్ట్రీలో బిజీగా మారింది. హీరోయిన్ గా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. కలర్ ఫోటో ద్వారా నటిగా ప్రశంసలు అందుకుంది చాందిని. ఆ తర్వాత విశ్వక్ సేన్ హీరోగా నటించిన గామి తో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇక ఆ తర్వాత మ్యూజికల్ షాప్ మూర్తి, ఏవమ్ చిత్రాలతో మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించింది. బ్యాక్ టూ బ్యాక్ లతో బిజీగా గడిపిన చాందిని.. కొన్ని రోజులుగా సైలెంట్ అయ్యింది. అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా కనిపించడం లేదు. తాజాగా తన సోషల్ మీడియోలో చాందిని చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరలవుతుంది. వరుస లతో బిజీగా ఉన్న చాందిని గాయం అయినట్లుగా తెలుస్తోంది."హాల్లో గాయ్స్.. నేను గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అంతగా యాక్టివ్ గా ఉండడం లేదు. ఎందుకంటే కొన్ని నెలల క్రితం గాయమైంది. నేను దాని తీవ్రతను అర్థం చేసుకోలేక షూటింగ్స్ లో పాల్గొన్నాను. ఇప్పుడు ఆ గాయం మరింత పెద్దదిగా మారింది. నేను నా షూటింగ్స్ కోసం వెళ్తుంటే ఆ గాయం మరింతగా నన్ను బాధించడం ప్రారంబించింది. దీంతో నేను ఇప్పుడు అన్నింటికి దూరంగా ఉండాలని ఫిక్స్ అయ్యాను. మళ్లీ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత సోషల్ మీడియాకు తిరిగి వస్తాను" అంటూ తన ఇన్ స్టాలో ఓ పోస్ట్ చేసింది. ప్రస్తుతం చాందిని చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ కావడంతో ఆమెను జాగ్రత్తలు చెబుతున్నారు నెటిజన్స్.